

టన్ను చీనీ రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారులోని కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.5, సరాసరిన రూ.10 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.6°/12.2°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలి తగ్గుముఖం పట్టింది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపటిలోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలి



పుట్టపర్తి అర్బన్: జిల్లా వ్యాప్తంగా ఈ- కేవైసీ పూర్తి కాని రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి మార్చి 4 లోపు ఈ - కేవైసీ పూర్తి చేసుకోవాలని కలెక్టర్ బసంత్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో 100 శాతం ఈ - పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 95,535 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారన్నారు. ఈ- పంట నమోదు యాప్‌లో వేలి ముద్రలు వేసి ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ-కేవైసీ పూర్తి చేస్తే ఏ కారణం చేత అయినా పంట నష్టం జరిగితే ప్రభుత్వం ద్వారా నష్ట పరిహారం పొందడానికి అర్హుల వుతారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 96 శాతం ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారన్నారు.

గుడిబండ కేంద్రంగా నూతన ఐసీడీఎస్ ప్రాజెక్టు

- సీడీపీఓగా పద్మావతి నియామకం

మడకశిర: గుడిబండ కేంద్రంగా ఐసీడీఎస్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు తొలి నూతన సీడీపీఓగా పద్మావతిని ప్రభుత్వం నియమించింది. రేపో మాపో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇంతకు మునుపు మడకశిర కేంద్రంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు ఉండేది. ఈ ప్రాజెక్టును విభజించడంతో గుడిబండ కేంద్రంగా నూతన ప్రాజెక్టు ఏర్పాటైంది. మడకశిర ప్రాజెక్టు పరిధిలోకి మడకశిర, రొళ్ల, అగళి మండలాల్లోని 269 అంగన్‌వాడీ కేంద్రాలు వస్తాయి. అదే విధంగా గుడిబండ ప్రాజెక్టు పరిధిలోకి గుడిబండ, అమరాపురం మండలాల్లోని 169 అంగన్‌వాడీ కేంద్రాలు వస్తాయి. ఇదిలా ఉండగా మడకశిర ప్రాజెక్టు సీడీపీఓగా నాగమల్లేశ్వరి కొనసాగనున్నారు. గుడిబండ ఐసీడీఎస్ ప్రాజెక్టు నూతన సీడీపీఓగా పద్మావతిని ప్రభుత్వం నియమించింది. మడకశిర ప్రాజెక్టు పరిధిలో 11 మంది, గుడిబండ ప్రాజెక్టు పరిధిలో ఏడుగురు చొప్పున సూపర్ వైజర్లు పని చేస్తారని స్థానిక సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు.

ప్రాక్టికల్స్‌కు 64 మంది గైర్హాజరు

ప్రశాంతినిలయం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్ పరీక్షలకు 64 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 45 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1,729 మంది విద్యార్థులకు 1691 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం విడతలో 43 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1,623 మంది విద్యార్థులకు 1,597 మంది హాజరయ్యారు. జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వెంకటరమణ నాయక్, శ్రీ సత్యసాయి జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి రఘునాథరెడ్డి, ఆర్ఐఓ సురేష్‌బాబు, జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు, హైపవర్ కమిటీ మెంబరు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు ఉమ్మడి జిల్లాలో వివిధ కేంద్రాలను తనిఖీ చేశారు.

'బెంగళూరు-కాచిగూడ' ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: శ్రీ విశ్వేశ్వరాయ టెర్మినల్ బెంగళూరు-కాచిగూడ మధ్య ఈ నెల 4,6 తేదీల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుపుతున్నట్లు డివిజన్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ నెల 3,5వ తేదీల్లో శ్రీ విశ్వేశ్వరాయ టెర్మినల్ బెంగళూరు (06523) నుంచి సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, మంత్రాలయరోడ్డు, రాయచూర్, గద్వాల , వనపర్తిరోడ్డు, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, కాచిగూడ జంక్షన్‌కు మరిసటి రోజు ఉదయం 5.20 గంటలకు చేరుకుంటుదన్నారు. తిరుగు ప్రయాణంలో కాచిగూడ జంక్షన్ (06524) నుంచి 4,6వ తేదీల్లో మాత్రమే రాత్రి 10.55 బయలుదేరి బెంగళూరుకు ఉదయం 11.45 గంటలకు చేరుతుందన్నారు.

భద్రతకు.. భరోసా



ఉరుకులు.. పరుగుల జీవితంలో ఏ క్షణానికి ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. అనుకోకుండా జరిగే ప్రమాదాల నుంచి సకాలంలో స్పందించి రక్షించే వారు కరువైన పరిస్థితుల్లో భద్రతకు భరోసా ఇస్తోంది 'డయల్ 100 '. జిల్లా ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు బ్లూకోల్ట్ సిబ్బంది ఎంతో మందికి ఆపన్న హస్తం అందించడంతో పాటు దుండగుల ఆటకట్టించారు.

- ఈ ఏడాది జనవరి 7న ధర్మవరం రైల్వేస్టేషన్ సమీపంలో 26 ఏళ్ల యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బంది వెళ్లి అతడిని కాపాడి కౌన్సెలింగ్ చేసి పంపించారు.
- గతేడాది ఏప్రిల్‌లో బత్తలపల్లి మండలం నెట్టువరంలో బాల్య వివాహం జరుగుతుండగా డయల్ 100కు సమాచారం వచ్చింది. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని బాల్య వివాహాన్ని ఆపించారు.
- గత ఏడాది ఆగస్టులో కదిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వివాహిత వెంట ఆకతాయి పడుతుండగా.. ఆమె డయల్ 100కు కాల్ చేసింది. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని ఆకతాయిని అరెస్టు చేయడంతో పాటు ఆమెను సురక్షితంగా ఇంటికి చేర్చారు.
- గత ఏడాది డిసెంబర్‌లో హిందూపురం పట్టణంలో రెండు వర్గాల మధ్య ఘర్షణకు దిగాయి. స్థానికులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. బ్లూకోల్ట్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి సర్దిజెప్పారు.
- గత సెప్టెంబరులో గోరంట్ల మండలంలో కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా డయల్ 100కు సమాచారం వచ్చింది. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నారు.
- ఇలా అన్ని సమస్యలకు ప్రజలు డయల్ 100ను సంప్రదిస్తున్నారు. సదరు సిబ్బంది వెంటనే స్పందించి అక్కడికి చేరుకుని భద్రతకు భరోసా ఇస్తున్నారు.

- కష్టాల్లో ఉన్న వారిని ఆదుకుంటున్న 'డయల్100'
- తక్షణసాయంతో ఎంతోమంది ప్రాణాలు కాపాడుతున్న బ్లూకోల్ట్ సిబ్బంది
- ప్రతి నెలా జిల్లాలో సగటున 700 మందిపైగా వినియోగం
- నిరంతర సేవలతో సత్ఫలితాలు

సాక్షి, పుట్టపర్తి: శాంతి భద్రతల పర్యవేక్షణలో భాగంగా 'డయల్ 100' విభాగానికి ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేకంగా బలగాలు ఉంటాయి. ఓ ద్విచక్ర వాహనంలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు నిర్దేశించిన ప్రాంతాల్లో సంచరిస్తూ ఉంటారు. 'డయల్ 100'కు వచ్చిన కాల్స్ ఆధారంగా 9 నిముషాల్లోపే ఆయా ప్రాంతాలకు వెళ్లి చర్యలు చేపడుతారు.

రాష్ట్ర కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ



ఇటీవల డయల్ 100ను రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానించారు. దీనికి వచ్చే ఫోన్లు నేరుగా జిల్లా కేంద్రంలోని కార్యాలయంతో పాటు రాష్ట్ర కమాండ్ కంట్రోల్‌కు చేరతాయి. సంబంధిత పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిబ్బంది ఎంత త్వరగా స్పందించారో రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి పర్యవేక్షిస్తారు. దీంతో పోలీసు వ్యవస్థలో మరింత జవాబుదారీతనం పెరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయి.

డయల్ 100 సేవలు ఇలా...

సంవత్సరం	నెల	వచ్చినకాల్స్
2022	ఏప్రిల్	678
2022	మే	745
2022	జూన్	713
2022	జూలై	611
2022	ఆగస్టు	827
2022	సెప్టెంబర్	798
2022	అక్టోబర్	769
2022	నవంబర్	690
2022	డిసెంబర్	749
2023	జనవరి	801
2023	ఫిబ్రవరి	703

లొకేషన్ ట్రాకింగ్ వ్యవస్థ



'డయల్ 100'లో కొత్తగా లొకేషన్ ట్రాకింగ్ ఫీచర్‌ను పోలీసుశాఖ ఇటీవల ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు ఎవరైనా అత్యవసర సర్వీసుకు కాల్ చేస్తే తాము ఎక్కడ ఉన్నారో చెప్పాల్సి వచ్చేది. గుర్తు తెలియని ప్రదేశాల్లో ఆపదలో చిక్కుకున్న వారికి ఇది సమస్యగా మారేది. దీనికి పరిష్కారంగా కాలర్ లొకేషన్ ఆటోమేటిక్ డయల్ 100 కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తెలిసేలా ఆధునీకరించారు. దీంతో ఫోన్ రావడమే తరువాయి వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి వెళ్లగలుగుతున్నారు.

ప్రమాదాలే ఎక్కువ..



'డయల్ 100' వచ్చే కాల్స్‌లో సగం పైగా ప్రమాదాలకు సంబంధించినవే. రోడ్డు ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు, ఆత్మహత్యల కేసులకు సంబంధించి ఎక్కువ మంది కాల్ చేస్తున్నారు. ఆయా కేసుల్లో భాగంగా 100 పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ప్రాణాలను కాపాడుతున్నారు. అలాగే బాల్య వివాహాలు, మిస్సింగ్, కిడ్నాప్, మహిళపై అఘాయిత్యం, భౌతిక దాడులు (ఘర్షణ)కు సంబంధించి అడపాదడపా 'డయల్ 100'కు కాల్స్ వస్తున్నాయి.

మరిన్ని అత్యవసర సేవలు



ఆపద సమయాల్లో ఎవరైనా 'డయల్ 100' సంప్రదించవచ్చు. శాంతి భద్రతల్లో భాగంగా కొంతమంది సిబ్బందిని 'డయల్ 100' కోసం కేటాయించాం. రానున్న రోజుల్లో మరింత మంది వినియోగించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. 'డయల్ 100' వ్యవస్థను పటిష్ట పరిచేందుకు మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. అత్యవసర సేవలతో పాటు అంబులెన్సు సేవలు, అగ్నిమాపక సేవలను కూడా పొందవచ్చు.

– రాహుల్ దేవ్ సింగ్, ఎస్పీ

ఏఎంవీఐ కారులో పాము



ఏఎంవీఐ కారులో పాము కోసం గాలిస్తున్న స్థానికులు

గోరంట్ల: డ్రైవింగ్ లైసెన్స్ కావాలనుకుందో.. లేదా అధికారినే భయపెట్టాలనుకుందో కానీ ఓ పాము అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కారులో దూరి హల్‌చల్ చేసింది. వివరాలు.. హిందూపురం ఆర్టీఓ కార్యాలయంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న జయశ్రీ గురువారం ఉదయం గోరంట్లలో వాహన తనిఖీలు చేపట్టారు. హిందూపురం ప్రధాన రహదారిపై రోడ్డు పక్కన తన కారును ఆపి వాహనాలను తనిఖీ చేస్తుండగా ఉన్నఫళంగా ఓ పాము ఆమె కారులో చొరబడింది. విషయాన్ని గమనించిన ఆమె వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి, స్థానికుల సాయంతో పామును బయటకు రప్పించేందుకు విశ్వ ప్రయత్నం చేసింది. అయినా పాము బయటకు రాలేదు. గంటల తరబడి పాము కోసం సాగిన అన్వేషణ ఫలించక పోవడంతో చివరకు ఆమె ఆ కారును పాముకే వదిలేసి మరో వాహనంలో హిందూపురానికి తిరిగి వెళ్లారు.

95 శాతం పింఛన్ల పంపిణీ



జగరాజుపల్లిలో పింఛన్ అందిస్తున్న వలంటీర్ ప్రసాద్

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం మంజూరు చేసిన సామాజిక భద్రతా పింఛన్లు పంపిణీలో భాగంగా రెండు రోజుల్లో 95 శాతం పింఛన్లు లబ్ధిదారులకు అందజేశారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలోని 2,65,194 మందికిగాను 2,50,006 మందికి పంపిణీ చేశారు. ఇప్పటిదాకా రూ.69,38,26,750 నగదును లబ్ధిదారులకు అందించారు.

కల్యాణము చూతము రారండి



యాగశాలలో కొలువు దీరిన లక్ష్మీనారసింహుడు

- నేడు ఖాద్రీ లక్ష్మీనారసింహుడి కల్యాణం
- రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన శ్రీవారి కల్యాణోత్సవం శుక్రవారం రాత్రి 9.30 గంటలకు జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించనున్నట్లు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి తెలిపారు. శ్రీవారి కల్యాణోత్సవాన్ని భక్తులందరూ కనులారా వీక్షించేందుకు ఆలయ, పోలీసు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. వేదికపై కేవలం అర్చకులు మాత్రమే కూర్చునే విధంగా ఆలయ కమిటీ నిర్ణయించింది.

తిరుమల నుంచి అర్చకులు

ఎప్పటిలాగానే కల్యాణోత్సవం జరిపేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి కొందరు అర్చక పండితులు హాజరుకానున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు శ్రీవారి కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో హాజరవుతారని పోలీసు అధికారులు అంచనా వేస్తున్నారు. యాగశాల నుంచి నవ వధువులుగా అలంకృతులై శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారసింహుడు రాత్రి 9 గంటల ప్రాంతంలో పల్లకీలో ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణ మండపం వద్దకు చేరుకుంటారు. ముక్కోటి దేవతలు వీక్షించే ఈ కల్యాణోత్సవాన్ని సాక్షాత్తు బ్రహ్మదేవుడే ముందుండి జరిపిస్తారని భక్తుల నమ్మకం.

వైభవంగా అంకురార్పణ

కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు గురువారం ఆలయ ప్రాంగణంలో వైభవంగా అంకురార్పణ జరిగింది. మంగళ వాయిద్యాల మధ్య నారసింహుడిని రాత్రి 9.45 గంటల ప్రాంతంలో ఆలయానికి నైరుతి దిశలో ఉన్న మండపాన్ని చేర్చారు. అర్చక పండితులు 'భూమి పూజ'తో పుట్ట మన్ను సేకరించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. యాగశాలలో ఆ మట్టితో నింపిన 9 పాలిక (కుండ)లలో నవ ధాన్యాలతో అంకురార్పణ (బీజావాపం) చేశారు.

ఆరని అగ్ని హోత్రం : బ్రహ్మోత్సవాల సందర్భంగా యాగశాలలో అంకురార్పణ అనంతరం అగ్నిహోత్రం వెలిగించారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకూ అంటే పక్షం రోజుల పాటు ఈ అగ్నిహోత్రం ఆరకుండా అర్చకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. బ్రహ్మోత్సవాల అంకురార్పణకు ఉభయదారులుగా బెంగళూరుకు చెందిన కేఎస్ నాగేశ్వరరావు కుటుంబీకులు వ్యవహరించినట్లు ఆలయ సహాయ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపే ధ్యేయం

- ఎమ్మెల్సీ స్థానాలు గెలిచి జగనన్నకు కానుకగా ఇద్దాం
- ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ శివరామిరెడ్డి పిలుపు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ వై.శివరామిరెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తదితరులు

పుట్టపర్తి: 'పశ్చిమ రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వెన్నపూస రవీందర్‌రెడ్డి, రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దాం' అని ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ వై.శివారామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకర్‌నారాయణ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఇటీవలే ఎమ్మెల్సీగా ఎన్నికైన మంగమ్మ, పుట్టపర్తి పార్టీ పరిశీలకులు విష్ణువర్ధన్ రెడ్డి, పార్టీ ఎస్సీ జిల్లా కన్వీనర్ నరసింహులు తదితరులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ నాలుగేళ్లుగా సీఎం జగన్ హయాంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఓటరుకు వివరించాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వం నిరుద్యోగులను ఎలా మోసం చేసిందో చెప్పాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి జగన్ ఆధ్వర్యంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేయాలన్నారు.

టీడీపీలో డబ్బు ఉన్న వారికే పదవులు..

టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక సంవత్సరాలుగా డబ్బులున్న వారికే ఎమ్మెల్సీ, రాజ్యసభ, ఇతర నామినేటెడ్ పదవులు ఇచ్చేవారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ విమర్శించారు. అయితే నేడు సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలో పార్టీలో పని చేసిన వారందరినీ గుర్తించి పదవులు ఇస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిత్యం టీడీపీ నాయకులతో పాటు ఎల్లో మీడియా బురద జల్లుతున్నారని, వారి కుట్రలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

సమష్టి కృషితో గెలుపునకు కృషి ..

వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి కట్టుగా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఓటర్ల వద్దకు వెళ్లి అభివృద్ధి, సంక్షేమాలను వివరించి ఓటు అభ్యర్థించాలన్నారు.

పిల్లలను తీర్చిదిద్దేవారే నిర్లక్ష్యం చేస్తే ఎలా?

- అలాంటి వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేయండి
- డీఈఓకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆదేశం



అనంతపురం డీఈఓ సాయిరాంతో ఆదేశాలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: పిల్లల భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దే గురుతర బాధ్యతను కొందరు ఉపాధ్యాయులు విస్మరిస్తుండడం బాధాకరమని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ, ప్రైవేటు పనుల్లో మునిగితేలుతున్న టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓను ఆదేశించారు. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ స్థాయీ సంఘాలు- 1, 2, 4, 7వ (ప్రణాళిక, ఆర్థిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు స్థానిక జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి పనులపై సమీక్షతో పాటు సమస్యలను మాత్రమే ప్రస్తావించాలని, ఎటువంటి ప్రతిపాదనలు, బడ్జెట్ ప్రకటించడానికి వీల్లేదని సీఈఓ భాస్కర్‌రెడ్డి సభ్యులకు వివరించారు. ఆ తరువాత సమావేశం కొనసాగింది. గోరంట్ల మండలంలో ఎంఈఓ మండల సమావేశాలకు రావడం లేదని జెడ్పీటీసీ జయరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ అనంతపురం చుట్టు పక్కల ప్రాంతాల్లో పని చేసే చాలా మంది ఉపాధ్యాయులు నిత్యం జిల్లా కేంద్రంలోనే ఉంటున్నారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తరచూ పాఠశాలలు ఎగ్గొడుతున్న వారిని గుర్తించి మెమోలు ఇవ్వాలని, అయినా మారకుంటే దూర ప్రాంతాలకు బదిలీ చేయాలని డీఈఓ సాయిరాంను ఆదేశించారు.

పనులు ప్రారంభించకుంటే రద్దు..

జెడ్పీటీసీ సభ్యులకు గతంలో రూ.20 లక్షలు, రూ.30 లక్షలు చొప్పున పనులు కేటాయించామని, వాటిని చాలా మంది ఇంకా ప్రారంభించలేదనే ఫిర్యాదులు ఉన్నాయని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ తెలిపారు. ప్రారంభించని పనులు రద్దు చేసి, ఇతర ప్రాంతాలకు కేటాయించాలని పంచాయతీరాజ్ ఈఈ రవీంద్రను జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆదేశించారు.

అపరిశుభ్రంగా అంగన్‌వాడీలు

చాలా ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు అపరిశుభ్రంగా తయారయ్యాయన్నారు. కొందరు సీడీపీఓలు ప్రజాప్రతినిధుల ఫోన్లు కూడా లిఫ్ట్ చేయడం లేదని, ఇంత నిర్లక్ష్యమైతే ఎలాగని నాయకులు నిలదీశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని పీడీ లక్ష్మీకుమారి తెలిపారు.

జిల్లాలో రీసర్వే పనులు వేగవంతం

- సీఎస్ జవహర్‌రెడ్డితో కలెక్టర్ బసంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ బసంత్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో జరుగుతున్న రీ సర్వే పనులు, జాతీయ రహదారులకు భూ సేకరణ, హౌసింగ్ నిర్మాణ పనులు నిర్దేశిత లక్ష్యాల మేరకు వేగంగా చేపడుతున్నామని కలెక్టర్ బసంత్‌కుమార్ తెలిపారు. గురువారం అమరావతి నుంచి పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి వర్చువల్ విధానంలో సమీక్షించారు. ఇందులో భాగంగానే పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో కలెక్టర్ బసంత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్, డీఆర్‌ఓ కొండయ్య, పలువురు జిల్లా అధికారులు వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జవహర్‌రెడ్డి మాట్లాడుతూ భూసేకరణ, హౌసింగ్ ఇళ్ల నిర్మాణాలు, రీ సర్వే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ రీసర్వే పనులను వేగంగా చేపడుతున్నామని, జాతీయ రహదారులకు భూసేకరణ పనులు సకాలంలో పూర్తి చేస్తామన్నారు. గృహ నిర్మాణాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేస్తామన్నారు. భూ సేకరణ ప్రక్రియలో భాగంగా 15 రోజుల్లోగా 350 హెక్టార్ల భూమిని ప్రభుత్వానికి అందించడం జరుగుతుందన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు న్యాయమైన పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ పకడ్బందీగా చేపడుతున్నట్లు చెప్పారు. ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. రీసర్వేలో మొబైల్ మేజిస్ట్రేట్‌లను ఏర్పాటు చేసుకొని రైతుల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

క్లుప్తంగా

5న జిల్లాస్థాయి క్రికెట్ జట్టు ఎంపిక

ధర్మవరం అర్బన్: స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆక్టివిటీస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక ప్రక్రియ ఈ నెల 5న ధర్మవరంలో చేపట్టనున్నారు. ఈ మేరకు శాప్ జిల్లా కో-ఆర్డినేటర్ ప్రసాద్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివారం ఉదయం 9గంటలకు ధర్మవరంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో చేపట్టే ఎంపిక ప్రక్రియకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫొటోలు, వైట్ యూనిఫాంతో హాజరు కావాలి. పూర్తి వివరాలకు 81434 73193, 90636 66366లో సంప్రదించవచ్చు.

మామిడి చెట్లు దగ్ధం

రాప్తాడు: గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు రాజేయడంతో మంటలు చెలరేగి మామిడి తోట దగ్ధమైంది. వివరాలు.. రాప్తాడు మండలం అయ్యవారిపల్లికి చెందని తలారి నారాయణకు రాప్తాడు చెరువు ఎగువన 3 ఎకరాల పొలం ఉంది. ఇందులో 300 మామిడి చెట్లను పెంచుతున్నాడు. మరో పది రోజుల్లో కాయలు కోసి మార్కెట్‌కు తరలించేందుకు రైతు సిద్ధమయ్యాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటకు పక్కన బీడు పొలంలో ఎండు గడ్డికి నిప్పు రాజేయడంతో మంటలు తోటను చుట్టుముట్టాయి. ఘటనలో 50 చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు కాలిపోయాయి. దాదాపు రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

ఎమ్మెల్సీ బరి.. పోటీ పెరిగింది మరీ

- 2017లో 35 మంది
- ప్రస్తుతం 61 మంది



అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజవకర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం అభ్యర్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2017 ఎన్నికల్లో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 35 మంది అభ్యర్థులు పోటీ పడగా... ప్రస్తుతం ఈ సంఖ్య 61కి చేరుకుంది. ప్రధానంగా పట్టభద్ర నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య రెండింతలు కావడం గమనార్హం. ఓటర్ల విషయంలోనూ గతంలో కంటే 80,542 మంది పట్టభద్రులు, 7,633 మంది ఉపాధ్యాయులు పెరిగారు.

పట్టభద్రులకు భారీ డిమాండ్..

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి 2017లో జరిగిన ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు పోటీ చేశారు. అలాగే ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో 10 మంది బరిలో నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో పట్టభద్రుల నియోజవర్గం నుంచి 49 మంది, ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి 12 మంది బరిలో ఉన్నారు. గతంతో పోల్చుకుంటే ఓటర్లు సైతం భారీగా పెరిగారు. 2017 ఎన్నికల్లో 2,48,582 పట్టభద్రులుండగా... వీరిలో 1,72,964 మంది పురుషులు, 76,618 మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం మొత్తం ఓటర్లు 3,30,124 కాగా, వీరిలో 2,22,340 మంది పురుషులు, 1,07,751 మంది మహిళలు, 33 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ప్రస్తుత ఎన్నికల్లో 80,542 మంది ఓటర్లు పెరిగారు.

నాడు... నేడు ఓటర్ల సంఖ్య ఇలా..

ఏడాది	పట్టభద్రులు	ఉపాధ్యాయులు
2017	2,49,582	20,515
2023	3,30,124	28,148

- 2017లో 20,515 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా... వీరిలో 13,306 మంది పురుషులు, 7,209 మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య 28,148కు చేరు కోగా... ఇందులో 17,247 మంది పురుషులు, 10,899 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. గతంలో పోల్చుకుంటే ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో 7,633 మంది ఉపాధ్యాయ ఓటర్లు పెరిగారు.
- 2017 ఎమ్మెల్సీ ఎన్నికల్లో 2,49,582 మంది పట్టభద్రులకు గాను 1,55,536 (62.32 శాతం) మంది ఓటు హక్కువినియోగించుకున్నారు. అలాగే 20,515 మంది ఉపాధ్యాయ ఓటర్లకు గాను 18,739 (93.84 శాతం) మంది ఓటు వేశారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు



టేబుళ్ల ఏర్పాటుపై సూచనలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

అనంతపురం అర్బన్: పశ్చిమ రాయలసీమ (ఉమ్మడి అనంతపురం, వైఎస్సార్, కర్నూలు జిల్లాలు) పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజవకర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు పకడ్బందీగా ఉండాలని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటు చేయనున్న జేఎన్‌టీయూ కళాశాలను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవితో కలిసి కలెక్టర్ గురువారం పరిశీలించారు. బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపునకు గదులు, వసతులు కల్పన, బ్యారికేడింగ్ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఎనికలకు సంబంధించిన సామాగ్రి పంపిణీ, రిసెప్షన్, ఓట్ల లెక్కింపు గదుల్లో కంచె ఏర్పాటు, వాహనాల పార్కింగ్ పనులు ప్రణాళికబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.

పటిష్ట బందోబస్తు ఉండాలి..

ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు, బందోబస్తు పటిష్టంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 49 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, బ్యాలెట్ పేపర్ పెద్దగా ఉంటుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అందుకు తగ్గట్టుగా ట్రేల పరిమాణం, టేబుళ్ల ఏర్పాటు, కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లకు సీటింగ్ పరిగణలోకి తీసుకుని, ఇందుకు సరిపడేలా స్థలం ఉండేలా చూసుకోవాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు అమర్చాలన్నారు. బందోబస్తు, కౌంటింగ్ సిబ్బందికి మౌలిక సదుపాయాలు, భోజన వసతి కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్‌ఓని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ మధుసూధన్, జేఎన్‌టీయూ ప్రిన్సిపల్ సుజాత, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఓబుళరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఖాద్రీ ఆలయంలో బహిరంగ వేలం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 8న ఆలయం ముందు టెంకాయలు అమ్ముకునేందుకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఆలయ చైర్మన్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తూర్పు రాజగోపురం ముందు భాగంలో షాపు నెం.1లో టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు ఒక సంవత్సరం హక్కు కోసం డిపాజిట్ రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. అలాగే షాపు నెం.2 (ఉట్టిలో) టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు ఒక సంవత్సరం హక్కు కోసం , వాహనాల పార్కింగ్ రుసుము వసూలు చేసుకునే హక్కు కోసం డిపాజిట్ రూ.3 లక్షలు చెల్లించాలని తెలిపారు. అలాగే పడమర రాజగోపురం ముందు భాగంలో టెంకాయలు, పూజా సామగ్రి అమ్ముకొనే హక్కు కోసం, తూర్పు రాజగోపురం ముందుభాగంలో భక్తుల పాదరక్షలు భద్రపరచుకునే హక్కుకు రూ. లక్ష డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. సీడీలు, క్యాసెట్లు అమ్ముకునే హక్కుకు, ధ్వజస్తంభం వద్ద కొబ్బరి చిప్పలు సేకరించడానికి రూ.లక్ష డిపాజిట్ చెల్లించాలని సూచించారు. పడమర రాజగోపురం ముందు భాగంలో భక్తుల పాదరక్షలు భద్రపరిచే హక్కు కోసం రూ. 50 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాల్గొనాలన్నారు.

ఆలయంలో సీల్డ్ టెండర్..

ఖాద్రీ ఆలయంలో స్వామివారికి ఉత్సవాలకు పూలు, తోమాలలు, గుండుమాలలు పంపిణీ చేసేందుకు , స్వామివారి అభిషేకానికి పాలు, పెరుగు, అన్నదానానికి ఇస్తరాకులు సప్లయ్ చేసేందుకు సీల్డ్ టెండర్ నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ తెలిపారు. టెండర్‌దారులు ఈ నెల 8న ఉదయం 10 గంటల లోపు ఆలయంలో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్‌లో టెండర్ ఫారాలు వేయాలన్నారు. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటకు టెండరుదార్ల సమక్షంలో టెండర్ తెరుస్తామన్నారు. టెండర్ దారుడు రూ. 10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. కట్టిన రశీదును టెండర్ ఫారంతో కలిసి టెండర్ బాక్స్‌లో వేయాలన్నారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో భూగర్భజలాలను పెంచడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకం(ఏపీఐఏటిపి) కింద బుక్కపట్నం మండలం గూనిపల్లి చెరువు, గోరంట్ల చెరువుల్లో చేపట్టిన పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో భూగర్భజలాలు బాగా పెరిగాయన్నారు. ఈ క్రమంలో వర్షపు నీటిని ఒడిసి పట్టుకునేలా చెరువులను మరింత అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూగర్భజల శాఖ సంయుక్త సంచాలకులు కేఎస్ శాస్త్రి, ఈఈ చంద్రశేఖర్, ఐడీ ఎక్స్‌పర్ట్ చంద్రశేఖర్, డీపీడీ నారాయణనాయక్, ఇరిగేషన్, అగ్రికల్చర్, ఫిసరీస్ తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులకు రిమాండ్

చెన్నేకొత్తపల్లి: బాలికను వేధించి ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. వివరాలను ఎస్‌ఐ శ్రీధర్ వెల్లడించారు. చెన్నేకొత్తపల్లి మండలం కోటంపల్లికి చెందిన 9వ తరగతి విద్యార్థిని సాయికుమారి పాఠశాలకు వెళ్లి వచ్చే క్రమంలో అదే గ్రామానికి చెందిన మహేష్, నారాయణస్వామి, చిరంజీవి, నాగభూషన్ వేధింపులకు గురి చేసేవారు. వీరి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో మనస్తాపం చెందిన సాయికుమారి మంగళవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఘటనపై మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... గురువారం ఉదయం నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, విచారణ అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

వ్యక్తి ఆత్మహత్య

హిందూపురం: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... హిందూపురంలోని శ్రీకంఠపురం వద్ద నివాసముంటున్న రంగనాథ్ (40)కు భార్య మౌనిక, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇంటి వద్దనే చిల్లర దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో వ్యాపారానికి పెట్టుబడుల కోసం చేసిన అప్పుల భారం పెరిగిపోయింది. దిక్కు తోచని స్థితిలో రంగనాథ్ మద్యానికి బానిసయ్యాడు. దీంతో సమస్యలు మరింత పెరిగాయి. ఈ నేపథ్యంలోనే అనారోగ్యం బారిన పడ్డాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు హిందూపురం రెండో పట్టణ పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి

పుట్టపర్తి: నాలుగు రోజుల క్రితం కనిపించకుండా పోయిన వ్యక్తి.. మృతదేహమై లభ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గత నెల 27న బుక్కపట్నంలోని బైపాస్‌కు చెందిన చింతకాయల రాము (46) కనిపించకుండా పోయాడు. ఘటనకు సంబంధించి అప్పట్లో కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో బుక్కపట్నం సమీపంలోని రాంబాయి కుంట వద్ద ఉన్న హంద్రీ-నీవా కాలువలో గురువారం ఉదయం రాము మృతదేహాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రాజ్

గుంతకల్లు: ఐటీసీలో పనిచేసే ప్రతి కార్మికుడికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ఐటీసీఎల్ సౌత్ రీజనల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.మోహన్‌రాజ్ డిమాండ్ చేశారు. మండలంలోని నక్కనదొడ్డి సమీపంలో ఉన్న ఐటీసీ డిపోలో గురువారం ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కుల సాధనకు ఏకతాటిపై రావాలని పిలుపునిచ్చారు. అదే సమయంలో ఐటీసీ లాభాలబాటలో నడిపించే బాధ్యతను విస్మరించరాదన్నారు. యూనియన్ రాష్ట్ర నాయకులు సుధాకర్, విజయ్‌కుమార్, జీఆర్‌కే రెడ్డి, ఐటీసీ లైజనర్ జీఎస్ నజీర్, నాయకులు రామయ్య, రహంతుల్లా, కుమార్, కరీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికురాలిపై అసభ్య ప్రవర్తన



సూపర్‌వైజర్ రమేష్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బాధితురాలి కుటుంబసభ్యులు

చిలమత్తూరు: మండలంలోని కోడూరు మస్రోతోపు సమీపంలోని టెక్స్‌పోర్ట్ గార్మెంట్స్‌లో పని చేస్తున్న కార్మికురాలిపై సూపర్‌వైజర్ రమేష్ అసభ్యంగా ప్రవర్తించాడంటూ గురువారం సాయంత్రం బాధితురాలి కుటుంబసభ్యులు ఆందోళన నిర్వహించారు. సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గార్మెంట్స్ మేనేజర్ అక్కడకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడారు. సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకుంటామని, మరోసారి ఇలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న సర్పంచ్ మురళి అక్కడకు చేరుకుని ఆందోళనకారులకు నచ్చచెప్పారు.

ఎంబీబీఎస్ సీటు.. రూ.19 లక్షలకు పోటు

బొమ్మనహాళ్: ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానంటూ రూ.లక్షలు కాజేసిన సైబర్ నేరగాడి ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్‌కు చెందిన కాళిదాసురాజు కుమారుడు చరణ్‌రాజ్ ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజుల క్రితం కాళిదాసురాజు సెల్‌ఫోన్‌కు గుర్తు తెలియన వ్యక్తి ఫోన్ చేసి, తాను బెంగళూరు నుంచి ఫోన్ చేస్తున్నానని పరిచయం చేసుకున్నాడు. చరణ్‌రాజ్‌కు ఎంబీబీఎస్ సీటు వచ్చేలా చేస్తామని ఇందుకు రూ.25 లక్షలు ఖర్చు అవుతుందని నమ్మబలికాడు. అవతలి వ్యక్తి మాయలో చిక్కుకున్న కాళిదాసురాజు తన కుమారుడికి ఎంబీబీఎస్ సీటు దక్కుతుందన్న ఆశతో విడతల వారీగా రూ.50 వేలు మొదలు రూ.లక్ష చొప్పున రూ.19.24 లక్షలు ఫోన్‌పే ద్వారా సైబర్ నేరగాడి ఫోన్‌పేకు బదిలీ చేశాడు. అనంతరం ఇదే విషయాన్ని బంధువులకు తెలపడంతో వారు అప్రమత్తం చేయడంతో ఆగంతకుడి ఫోన్ నంబర్‌కు కాల్ చేశాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ అంటూ సమాధానం రావడంతో తాను మోసపోయినట్లు గుర్తించి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

వైభవంగా లంకాదహనం



అశ్వవాహనంపై ఊరేగుతున్న చంద్రమౌళీశ్వరుడు

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అశ్వ వాహనంపై భక్తులకు చంద్రమౌళీశ్వరస్వామి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లంకాదహనం కార్యక్రమాన్ని గవిమఠం పీఠాధిపతి జగద్గురు చెన్నబసవరాజేంద్రస్వామి, ఉత్తరాధికారి కరిబసవరాజేంద్రస్వామి, సహాయ కమిషనర్ చిట్టెమ్మ ప్రారంభించారు. కార్యక్రమంలో మఠం ఏజెంట్ రాజన్నగౌడ్, సిబ్బంది శంకర్, నారాయణస్వామి, గోపి, మధు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇద్దరి దుర్మరణం



కొలన్న, రమేష్ మృతదేహాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు తెలిపిన మేరకు... డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన కొలన్న (40), కర్ణాటకలోని మాస్‌పల్లి నివాసి రమేష్ (42) గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై మాస్‌పల్లి నుంచి రాయదుర్గానికి బయలుదేరారు. డి.హీరేహాళ్ మండలం బాదనహాళ్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే తగులబడుతున్న కంప చెట్ల నుంచి వెలువడిన పొగ మొత్తం రోడ్డును కమ్మేసింది. పొగను దాటుకుని ఆవలకు చేరుకోగానే ఎదురుగా వేగంగా వచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనం నుజ్జునుజ్జైంది. కొలన్న, రమేష్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఉడాయించాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

సింహవాహనంపై చెన్నకేశవుడి వైభవం

యాడికి: మండల కేంద్రంలో శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివారు సింహవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శన మిచ్చారు. ముందుగా ఆలయ అర్చకుడు హరికృష్ణ శర్మ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి,భూదేవి సమేత శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఉత్సవ విగ్రహాలను సింహవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. స్వామి వారిని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆలయం పరిసర ప్రాంతం కిక్కిరిసిపోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఉత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ గురు ప్రసాద్ రెడ్డి బందోబస్తు నిర్వహించారు.



చెన్నకేశవస్వామి గ్రామోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు (ఇన్‌సెట్‌లో) సింహవాహనంపై స్వామివారు